క్లుప్తంగా

సహకార రంగ అభివృద్ధికి కృషి



పెనమలూరు: సహకార రంగం అభివృద్ధికి అందరి సహకారం కావాలని పెనమలూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం పెనమలూరు సహకార సొసైటీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో జి.సురేష్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణపై సదస్సు

గన్నవరంరూరల్: కొండపావులూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం) సౌత్ క్యాంపస్‌లో మంగళవారం విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో బాలల రక్షణ, పిల్లల హక్కుల రక్షణపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణ ప్రారంభించారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్ టింటు, క్యాంపస్ జాయింట్ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి, సీనియర్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కుమార్ రాకా ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలు, రంజన్‌కుమార్, నజియా పాల్గొన్నారు.

అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

రామవరప్పాడు: విద్యార్థులు అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరంనాయుడు, సైన్స్, హ్యూమనటీస్ విభాగాధిపతి కృష్ణారావు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన పెరగాలి

పెనమలూరు: మధుమేహంపై ప్రజల్లో అవగాహన పెరగాలని క్యాపిటల్ ఆస్పత్రి వైద్యుడు జె.పూర్ణచంద్రరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మంగళవారం వాకర్స్‌క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతంలో సమకాలీన శాస్త్రం

పెనమలూరు: సమకాలీన శాస్త్రాలు బోధిస్తున్న భావనలు భారతీయ ప్రాచీనాలు ఎంత గొప్పవో అర్థమవుతుందని రామాయణ ప్రవచన సుధాకరగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం సంస్కృతంలో సమకాలీన శాస్త్రంపై ప్రసంగించారు. ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడారు. మైలవరపు శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఏవో సాయిబాబు, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెనమలూరు: తాడిగడప వంతెన వద్ద మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కార్మికనగర్‌కు చెందిన వంగల కృష్ణారెడ్డి తాడిగడప వంతెన వద్ద న్యూడిల్స్ వ్యాపారం చేస్తాడు. అతను మద్యం తీసుకు వచ్చి అక్రమంగా విక్రయిస్తుండటంతో అతన్ని అదుపులోకి తీసుకుని 8 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఉన్నత స్థానాలకు చేరాలి

ఘనంగా బాలల దినోత్సవం

గన్నవరం: విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరాలని, బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసబాబు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని మండల లీగల్ సర్వీస్ అథారిటీ, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. బాలల హక్కులకు భంగం కలిగితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు, హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, సీనియర్ న్యాయవాదులు తాళ్లపర్తి వెంకట్రావు, శీలం సాంబశివరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: విద్యార్థులు ప్రతిభ చాటాలని పెనమలూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నానావత్ చిన్ని అన్నారు. యనమలకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గుమ్మడి అలేఖ్య జ్ఞాపకార్థం ఉపకార వేతనాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మరీదు శ్రీనివాసరావు, గుమ్మడి అన్వేష్, సాల్మన్‌రాజు, సుకుమార్ ఎంఈవో శేషగిరిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనమలూరు: బాలల దినోత్సవం సందర్భంగా తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు మొక్కలు నాటారు. కానూరు వినాయక్‌నగర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు వేమూరి బాలకృష్ణ, వినాయక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆంజనేయప్రసాద్, తుమాటి శ్రీరాములు, సతీష్, నాగరాజు, రాకేష్, బ్రహ్మం పలువురు పాల్గొన్నారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా చేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కొడాలి రామశేషాద్రిరావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పునాదిపాడులో బహుమతులు అందిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో బాలల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఎంఈవో సాంబశివరావు బాలల దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): బాలల దినోత్సవం కార్యక్రమం నున్న వెస్ట్ ఎలిమెంటరీ స్కూల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, వార్డు సభ్యురాలు చింతా నాగరేణుక, ఉపాధ్యాయులు పండిట్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. తొలుత విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎంపీటీసీ దంపతులు బొంతు సరోజిని, సాంబిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ షేక్‌హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు, భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మెయిన్ స్కూల్, హృదయనగర్ స్కూల్లో వేడుకలు జరిగాయి.

ఉయ్యూరు: బాలల దినోత్సవాన్ని ఉయ్యూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరు గ్రంథాలయంలో దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు.. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్‌చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు



ఉంగుటూరులో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో సాంబశివరావు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని)

షేక్ అబు కలాం, శివాలయం చైర్మన్ కుటుంబరాజు, గ్రంథాలయాధికారి బి.రమణి పాల్గొన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యాన బాలల దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, నూకల వెంకట సాంబశివరావు, ఊర కిషోర్, నల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు. పబ్లిక్ స్కూల్‌లో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కంకిపాడు: బాలల దినోత్సవం మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా జరిగింది. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ రాజ్యలక్ష్మి ప్రసంగించారు. ఉపాధ్యాయిని కాత్యాయనీదేవి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రూ 10 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్‌ను వితరణగా అందించారు. సర్పంచ్ మునిబోయిన విజయకుమారి, మాజీ సర్పంచ్ మునిబోయిన వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: రాజన్న తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గొడవర్రులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. అర్హత ఉన్నా తమకు ఇళ్లస్థలాలు లబ్ధి జరగలేదని, ఇరుకు ఇళ్లల్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. ఇతర సమస్యలపై మ్మెల్యే పార్థసారథికి విజ్ఞప్తి చేశారు. సమస్యలపై ఆయా శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్ష చేశారు. స్థానిక సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలూ సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, ఎంపీటీసీ చుండూరు నిర్మలజ్యోతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌చిన్నా, పార్టీ నేతలు పాల్గొన్నారు.



గొడవర్రులో సంక్షేమ పాలన వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

క్రీడాకారులు చదువును నిర్లక్ష్యం చేయొద్దు

డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖ

విజయవాడరూరల్: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణిస్తారో అప్పుడే జీవితంలో స్థిరపడతారని ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు సాధించిన ఇంటర్నేషనల్ ఆర్చరీ అర్జున అవార్డు గ్రహీత, ఎన్టీఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమంలో సురేఖ పాల్గొన్నారు. ఇటీవల ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించిన కార్తీక, శరణ్యకు బంగారు పతకాలు అందజేశారు. అండర్–19 రెజ్లింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన బాలికల జట్టుకు ఆమె ట్రోఫీని అందజేశారు. అనంతరం నున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధి నరెడ్ల సత్యనారాయణరెడ్డి తదితరులు జ్యోతిసురేఖ, ఆమె తండ్రి సురేంద్రను ఘనంగా సత్కరించారు.



డెప్యూటీ కలెక్టర్ జ్యోతి సురేఖకు సత్కారం

ఉన్నత స్థానాలకు... గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

పెనమలూరు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. గ్రామంలో మంగళ వారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లే అలవాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గాభవాని, శాఖ గ్రంథాలయ అధికారి పి.హరీష పాల్గొన్నారు.

వణుకూరులో..

వణుకూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను వైఎస్సార్ సీపీ నేత చక్క గోపీకృష్ణ ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి భారతి, ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం కె.ఝాన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, గ్రంథాలయ అధికారి ఎంవీ భాస్కరరావు, సాయికృష్ణ, భార్గవ్ పలువురు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానం పంచే దేవాలయాలు

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంచే దేవాలయాలని పురుషోత్తపట్నం సర్పంచ్ రోహిణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయం కార్యదర్శి ఈశ్వర్, లైబ్రేరియన్ కె.కృపానందం, వెంకటరామయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయం వద్ద వారోత్సవాలను విశ్రాంత ఉపాధ్యాయుడు కె.గోపాలరావు ప్రారంభించారు. లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి, విజయసారథి, షేక్ ఇమాం పాల్గొన్నారు.



పురుషోత్తపట్నంలో వారోత్సవాలు ప్రారంభించిన సర్పంచ్ రోహిణి

ఉయ్యూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉయ్యూరు, కాటూరు గ్రామాల్లోని గ్రంథాలయాల్లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉయ్యూరు గ్రంథాలయ వారోత్సవాల్లో గ్రంథాలయ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, కార్యదర్శి నగేష్ పాల్గొన్నారు. రికార్డులను తనిఖీ చేశారు. పెద ఓగిరాల, ముదునూరు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రంథాలయాధికారులు రమణి, రమేష్, నాగరాజు, పాల్గొన్నారు.

గన్నవరం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఎంపీపీ అనగాని రవి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ నర్రా సీతారామారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జాస్తి విజయభూషణ్‌కుమార్, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, కమిటీ సభ్యులు చిమట రామారావు, ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి డి. బాబురావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: మానికొండ, ఆత్కూరు, తేలప్రోలు, ఉంగుటూరు గ్రామాల్లోని జిల్లా శాఖా గ్రంథాలయాల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఆత్కూరు గ్రంథాలయ వారోత్సవాల్లో ఎంపీపీ వి.సరోజిని పాల్గొని వారోత్సవాలు ప్రారంభించారు.



కంకిపాడు గ్రంథాలయంలో జరిగిన వేడుకలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాపులపాడు గ్రంథాలయంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, వీరవల్లి గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు కోడెబోయిన బాబి, కానుమోలు సర్పంచ్ ఎనికేపల్లి సీతమ్మ పాల్గొన్నారు.

కంకిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కంకిపాడు, తెన్నేరు శాఖా గ్రంథాలయాల్లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. తెన్నేరు గ్రంథాలయంలో చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని చిన్నారులు నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎంపీటీసీ శాంతి, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం శివకుమారి, గ్రంథాలయాధికారి సునీత తదితరులు పాల్గొన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు బ్యాంకు మేనేజర్ సుందర్‌రావు, గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, పాఠక ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి సుమారు నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం .. బాపులపాడు మండలం పెరికీడు వద్ద జాతీయ రహదారి 215హెచ్‌పై వాహన తనిఖీలు చేస్తుండగా, అండర్‌పాస్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన రెండు స్కూటీలను ఆపి తనిఖీ చేసినట్లు చెప్పారు. విజయవాడకు చెందిన పల్లిపోగు సాయి చైతన్య, లండా ప్రేమ్ కిరణ్‌తో పాటు మరో మహిళ శెట్టి అన్నపూర్ణ గంజాయి తరలిస్తుండగా పట్టుపడ్డారు. వీరి నుంచి నాలుగు కేజీల గంజాయితో పాటుగా రెండు స్కూటీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పని చేయాలి

కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వక్తలు పేర్కొన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేసి బదిలీ అయిన సుందర్‌కుమార్‌కు మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. సుందర్‌కుమార్ అందించిన వైద్య సేవలపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సంతోష చంద్రిక, డాక్టర్ సాయి నిఖిత, డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ అంజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్తిక పూజలు ప్రారంభం

రామవరప్పాడు/విజయవాడరూరల్: కార్తిక మాసం ప్రారంభం పురస్కరించుకుని రూరల్‌మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం సాయంత్రం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.

విజయవాడరూరల్: కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా మంగళవారం రూరల్ గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక పూజలు చేశారు.

25 మంది పూర్వవిద్యార్థుల రక్తదానం

పెనమలూరు: కానూరులోని సెయింట్ థెరిసా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన పాఠశాలలో మంగళవారం రక్తదాన శిబిరంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో 25 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ జోయెసి, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కార్తీక్, వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కంకిపాడు: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో గోసాల హెచ్ఎంకే విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరిని పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్ సుక్‌మిత్‌కౌర్ ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం వారు మాట్లాడుతూ అండర్–17 బాలికల జిల్లా జట్టులో పాఠశాల నుంచి ఈడా సాయిశ్రీ ప్రాతినిధ్యం వహించిందని తెలిపారు. బాలుర జట్టులో పాఠశాల నుంచి రామ్‌చరణ్, మణికంఠ, లోకేష్, పూర్ణ మణికంఠ, సిద్ధిక్ పాల్గొని ప్రతిభ చాటారన్నారు. బాలురజట్టు నాలుగో స్థానంలో నిలిచిందన్నారు.

తండ్రిపై దాడి చేసిన కుమారుడి అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: తండ్రిపై దాడి చేసి గాయపర్చిన కుమారుడిపై జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. హనుమాన్ నగర్‌లో నివసిస్తున్న కోటే వెంకట్రావు వద్దకు ఏలూరు జిల్లా పెదపాడు మండలం కాజీగూడెంలో నివసిస్తున్న అతని తండ్రి విష్ణుమూర్తి సోమవారం వచ్చాడు. కుమారుడికి అద్దె సొమ్ము నిమిత్తం రూ.18 వేలు చెల్లించగా, అది సరిపోదంటూ వెంకట్రావు ఆగ్రహావేశం వ్యక్తం చేశాడు. తండ్రి విష్ణుమూర్తి ముఖంపై ఇనుప రాడ్డుతో బలంగా కొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి సమాచారం మేరకు కేసు నమోదు చేసిన హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ మంగళవారం వెంకట్రావును అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించారు.

ప్రకటన

[illegible]

తేది:15.11.2023

జగనన్నతో రాష్ట్ర భవిష్యత్తు

ఉయ్యూరు: జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్తు అని ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గండిగుంటలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గెత్తం అనుపమ, ఎంపీటీసీలు బందెల శ్రీనివాసరావు, గుండే పోతురాజు, పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవితో కలిసి ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ అభివృద్ధి పథకాలతో కూడిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి వేణు, గెత్తం విజయ్‌కుమార్, బళ్లారి చిట్టిబాబు, నందం జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 10, 12 వార్డు సచివాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్‌చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ వైద్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జంపాన పూర్ణిమ, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, బేగ్, అడపాక ఆది లక్ష్మి, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, నాయకులు జంపాన కొండలరావు, బొబ్బిలి నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనన్న పాలన అవసరం

పెనమలూరు: పెనమలూరు 1వ నంబర్ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పరిపాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రజాప్రతినిధులు కొనియాడారు. స్థానిక గ్రామ సచివాలయం–3లో మంగళవారం పల్లెకు పోదాం, 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయం–3లో ప్రజలకు అందించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన రూ. 20.82 కోట్ల సంక్షేమ బోర్డును ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆవిష్కరించారు. అనంతరం గృహ సారథులకు కిట్లను జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ గన్నవరం, ఉంగుటూరు మండలాల అధ్యక్షులు నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకరరెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నే సుందరరావు అందజేశారు. పార్టీ నాయకులు కొల్లి రాజశేఖర్, ఎస్‌కెఎంఎంఏ కలాం, లుక్కా ప్రసాద్, కుర్రాటి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుద్దవరం బస్టాప్ వద్ద పార్టీ జెండాను ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు.



గండిగుంటలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి

పేదల సంక్షేమమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం కాకులపాడులోని గ్రామ సచివాలయం ప్రాంగణంలో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ సూరపనేని రాధాకృష్ణమూర్తి ఆవిష్కరించారు. సర్పంచ్ కాజా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గాంధీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్ సీపీ జెండాను సూరపనేని రాధాకృష్ణమూర్తి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం సర్పంచ్‌లు కాకొల్లు అన్నామణి, రెడ్డి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన సర్పంచి లింగాల భాస్కరరావు



జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు

కంకిపాడు: జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు–3 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సచివాలయ ప్రాంగణంలో పార్టీ జెండాను బాకీ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, డైరెక్టర్‌లు జె.నాగేశ్వరరావు, మరియబాబు, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, జగన్నాథపురం సర్పంచ్ పి.శ్రీనివాసరావు, మంతెన ఎంపీటీసీ బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హస్తకళాకారులు నైపుణ్యం పెంచుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: చేతివృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి కల్పించటం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించొచ్చని హస్తకళా సేవా కేంద్రం (విజయవాడ) రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని శాలివాహన కాలనీలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హస్తకళాకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని కుమ్మరులు రూపొందించిన పలురకాల వస్తువులను హస్తకళా సేవా కేంద్రం అధికారులు తిలకించారు. హస్తకళా సేవా కేంద్రం కన్సల్టెంట్ పీడీ సుధీర్‌కుమార్, వీరవల్లి శాలివాహన సంఘం అధ్యక్షుడు రాజరపు బలరామయ్య, సభ్యులు యర్రారపు శేషగిరిరావు, యనగంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

రామవరప్పాడు: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా యూత్ అధికారి సుంకర రాము అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఫార్మేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ యువతలో లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంచి వారిని సంఘటిత రంగం వైపు తీసుకెళ్లడంలో ఎన్‌వైకే ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటింగ్ సభ్యుడు భీమల వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌వైకే ఒక సంస్థాగత నిర్మాణమని యువత కొత్త కొత్త ఒరవడులను నేర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ హెచ్‌ఓడీ బి. కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చిన్ని, విద్యార్థులు పాల్గొన్నారు.

400 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: శేరినరసన్నపాలెంలో అయ్యప్ప దీక్షాధారులకు వరుసగా తొమ్మిదో ఏట నిత్యాన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన అడపా దేవులు బాబు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పలకు మంగళవారం 400 మందికి అన్నదానం చేశారు. సర్పంచ్ అంజిబాబు, మాజీ సర్పంచ్‌లు యుగంధరరావు, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.